జాతీయ తెలుగు దినపత్రిక
ప్రజాజ్యోతి
ప్రతి అక్షరం ప్రజల కోసం
భద్రాద్రి కొత్తగూడెం
శుక్రవారం | 31 | జులై | 2026 ◆ పేజీలు : 7

# ఎగువ జలాలతో.. గోదావరి పరవళ్లు

- భద్రాచలం వద్ద 28.40 అడుగులకు చేరిన నీటిమట్టం
- ఎన్నో రోజుల తర్వాత జలకళను సంతరించుకున్న గోదావరి..
- దీంతో రైతుల్లో చిగురిస్తున్న ఆశలు..
- క్రమంగా పెరుగుతున్న నీటిమట్టం
- వరద పరిస్థితులపై అప్రమత్తమైన అధికారులు, ప్రభుత్వం
- ముంపు ప్రాంతాల ప్రజలు, జాలరులు

అప్రమత్తంగా ఉండాలని హెచ్చరిక



2 లో...

# కబ్జాలకైతే కలిసిపోతారు..!

- బయట రాజకీయ ప్రత్యర్థులు.. లోపల ప్రభుత్వ భూముల కబ్జా విషయంలో ఒక్కటేనా..?
- ప్రగతినగర్ స్మశాన వాటిక పక్కనున్న 2,800 గజాల ప్రభుత్వ స్థలంపై మళ్లీ కన్ను..
- ఇద్దరు కార్పొరేటర్లు, ఓ మాజీ కౌన్సిలర్ పాత్రపై స్థానికంగా చర్చ..
- గతంలో ప్రభుత్వ బోర్డు, రద్దైన ఇంటి నంబర్లు, రూ.25 లక్షల అభివృద్ధి ప్రతిపాదన..
- తిరిగి ప్రైవేట్ వ్యక్తులకు అమ్మేందుకు కసరత్తులు..
- నోరుమెదపని రెవెన్యూ, కార్పొరేషన్ అధికారులు..
- అడ్వాన్స్ లావాదేవీలు, నిర్మాణ యత్నాలపై విచారణ జరపాలని డిమాండ్..



**భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ప్రతినిధి, జూలై 30, ప్రజాజ్యోతి :** కొత్తగూడెం మున్సిపల్ కార్పొరేషన్లోని 29 వ డివిజన్ పరిధిలో గల ప్రగతినగర్ స్మశాన వాటిక సమీపంలో ఉన్న సుమారు 2,800 గజాల ప్రభుత్వ స్థలం మరోసారి వివాదానికి కేంద్రబిందువుగా మారింది. రాజకీయంగా బయట ఒకరిపై ఒకరు విమర్శలు చేసుకునే వేర్వేరు పార్టీలకు చెందిన నాయకులు, ప్రభుత్వ భూముల కబ్జా విషయంలో మాత్రం చేతులు కలుపుతున్నారనే చర్చ స్థానికంగా జోరుగా సాగుతోంది. ఇందులో ముఖ్యంగా ఇద్దరు కార్పొరేటర్లు, అదే ప్రాంతానికి (ప్రగతి నగర్) చెందిన ఓ మాజీ కౌన్సిలర్ కలిసి ఈ స్థలాన్ని కబ్జా చేసి విక్రయించే ప్రయత్నాలు జరుగుతున్నాయని ఆరోపణలు వినిపిస్తున్నాయి. స్థానికుల కథనం ప్రకారం, ఈ స్థలం చాలా కాలంగా ప్రభుత్వ భూమిగానే రికార్డుల్లో ఉంది. గతంలో సంబంధిత శాఖ అధికారులు అక్కడ ప్రభుత్వ స్థలమని బోర్డు కూడా ఏర్పాటు చేశారు. అయితే 2021లో అప్పటి ప్రజాప్రతినిధి ఆ బోర్డును తొలగించి, ఈ స్థలంలో చిన్న చిన్న గదులు నిర్మించి వాటికి ఇంటి నంబర్లు కూడా పొందినట్లు సమాచారం. దీంతో పాటు అక్రమంగా కరెంట్ పోల్స్ కూడా వేశారు. అనంతరం దీనిపై స్థానికులు మున్సిపల్, రెవెన్యూ అధికారులకు

మిగతా 7 లో...

# అన్నపురెడ్డిపల్లి మండలంలో విస్తృతంగా పర్యటించిన మంత్రి పొంగులేటి



- రూ.2.77 కోట్ల అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు
- ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారుల గృహప్రవేశాల్లో పాల్గొన్న మంత్రి
- సీతారామ ప్రాజెక్టు నిర్వాసితుల సమస్యల పరిష్కారానికి అధికారులకు ఆదేశాలు

**అన్నపురెడ్డిపల్లి, జూలై 30 (ప్రజాజ్యోతి):** అన్నపురెడ్డిపల్లి మండలంలో గురువారం విస్తృతంగా పర్యటించిన రాష్ట్ర రెవెన్యూ, గృహ నిర్మాణ, సమాచార & ప్రజాసంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి రూ.2.77 కోట్లకు పైగా వ్యయంతో చేపట్టనున్న పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు చేసి, పూర్తయిన పనులను ప్రారంభించారు. అనంతరం వివిధ గ్రామాల్లో ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారుల నూతన గృహప్రవేశ కార్యక్రమాల్లో పాల్గొని వారికి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమాల్లో అశ్వరావుపేట ఎమ్మెల్యే జారే ఆదినారాయణ, జిల్లా కలెక్టర్ అంకిత్ పాల్గొన్నారు. పర్యటనలో భాగంగా గుంపెన గ్రామంలో సీసీ రోడ్ల నిర్మాణ పనులకు శంకుస్థాపన చేశారు. నరసాపురం గ్రామంలో అంతర్గత సీసీ రోడ్లు, కల్వర్టుల

మిగతా 2 లో...

# భారీ వర్షాల నేపథ్యంలో అన్ని శాఖలు అప్రమత్తంగా ఉండాలి

- జీరో క్యాజువాలిటీస్ లక్ష్యంగా సమన్వయంతో ముందస్తు చర్యలు చేపట్టాలి
- రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు



2 లో...

# కోతుల బెడదకు మార్గం చూపితే... ప్రత్యామ్నాయ పంటలకు సిద్ధమే..!

- వర్షాభావం పేరుతో పంటలు మార్చమంటున్న ప్రభుత్వం, అధికారులు
- రైతు వేదికల్లో ప్రత్యామ్నాయ పంటలపై అవగాహన కల్పిస్తున్న జిల్లా యంత్రాంగం
- కానీ కోతుల సమస్యకు మాత్రం పరిష్కారం చూపడం లేదని రైతుల ఆవేదన
- పప్పుధాన్యాలు, నూనెగింజల పంటలన్నీ కోతుల బారినే
- పంటలు కాపాడితే ఏ పంటనైనా సాగు చేస్తామని స్పష్టం చేస్తున్న రైతాంగం



7 లో...

## అన్నపురెడ్డిపల్లి మండలంలో విస్తృతంగా పర్యటించిన మంత్రి పొంగులేటి







(మొదటి పేజీ తరువాయి...)

నిర్మాణ పనులకు శ్రీకారం చుట్టారు. భీమునిగూడెం గ్రామంలో నూతన గ్రామ పంచాయతీ భవనాన్ని ప్రారంభించారు. కోండాయిగూడెం గ్రామంలో సీసీ రోడ్ల నిర్మాణ పనులకు, పెద్దిరెడ్డిగూడెం గ్రామపంచాయతీ పరిధిలోని ఎర్రగుంటలో అంతర్గత సీసీ రోడ్ల నిర్మాణ పనులకు శంకుస్థాపనలు నిర్వహించారు. అనంతరం పెద్దిరెడ్డిగూడెం, గుంపెన, భీమునిగూడెం, నరసాపురం, ఊటుపల్లి, రంగాపురం గ్రామాలకు చెందిన ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారుల గృహప్రవేశ కార్యక్రమాల్లో పాల్గొని వారికి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి మాట్లాడుతూ ప్రజా సంక్షేమం, గ్రామాల సమగ్రాభివృద్ధే రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని అన్నారు. ప్రతి పేద కుటుంబానికి సొంత ఇంటి కలను సాకారం చేయడమే ఇందిరమ్మ ఇళ్ల పథకం లక్ష్యమని తెలిపారు. మహిళల ఆర్థిక సాధికారత, రైతుల సంక్షేమం, గ్రామీణ ప్రాంతాల్లో మౌలిక వసతుల కల్పనకు ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యత ఇస్తోందన్నారు. గ్రామాల్లో సీసీ రోడ్లు, తాగునీటి సౌకర్యాలు, డ్రైనేజీలు, గ్రామపంచాయతీ భవనాలు వంటి మౌలిక వసతులను బలోపేతం చేస్తూ సమగ్ర అభివృద్ధికి ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. చేపట్టిన అభివృద్ధి పనులను నాణ్యతా ప్రమాణాలతో నిర్ణీత గడువులో పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. సీతారామ ప్రాజెక్టు భూనిర్వాసితుల సమస్యలను ప్రాధాన్యంగా తీసుకుని వారం రోజుల్లో పరిష్కారానికి అవసరమైన చర్యలు చేపట్టాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. అశ్వరావుపేట ఎమ్మెల్యే జారే ఆదినారాయణ మాట్లాడుతూ గ్రామాల అభివృద్ధికి ప్రభుత్వం ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తోందన్నారు. జిల్లా కలెక్టర్ అంకిత్ మాట్లాడుతూ వర్షాకాల పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని అధికారులు అప్రమత్తంగా ఉండాలని, అభివృద్ధి పనులను వేగంగా పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని సూచించారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఎస్పీ రోహిత్ రాజు, అదనపు కలెక్టర్ వేణుగోపాల్, ఆర్డీవో మధు, జిల్లా పంచాయతీ అధికారి అనూష, జూలూరుపాడు సర్కిల్ ఇన్స్పెక్టర్ శ్రీలక్ష్మి ,హౌసింగ్ శాఖ అధికారులు, తహసీల్దార్, ప్రజాప్రతినిధులు, కాంగ్రెస్ శ్రేణులు, వివిధ శాఖల అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

# ఎగువ జలాలతో.. గోదావరి పరవళ్లు

**భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ప్రతినిధి | జూలై 31 | ప్రజాజ్యోతి**

ఎన్నో రోజులుగా ఎండలతో, ఎల్‌నినో ప్రభావంతో వెలవెలబోయిన గోదావరి మళ్లీ జీవం పోసుకుంది. మొన్నటి వరకు ఇసుక తిన్నెల మధ్య నెమ్మదిగా సాగిన ప్రవాహం.. ఇప్పుడు ఎగువ ప్రాంతాల నుంచి వస్తున్న జలాలతో పరవళ్లు తొక్కుతోంది. రెండు ఒడ్డులను తాకుతూ జలకళ సంతరించుకున్న గోదావరిని చూసి భద్రాచలం ప్రజలు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. నిండుకుండలా మారుతున్న గోదావరిని చూసి ఒకవైపు సాగునీటి ఆశలు చిగురిస్తుండగా, మరోవైపు వరద పరిస్థితులపై అధికారులు అప్రమత్తమవుతున్నారు. ఇలా ఆనందం, అప్రమత్తత రెండూ కలిసి కనిపిస్తున్న వేళ భద్రాచలం వద్ద గోదావరి నీటిమట్టం క్రమంగా పెరుగుతోంది.

### ♦ ఎగువ వర్షాలతో పెరిగిన ప్రవాహం..

గత మూడు రోజులుగా ఎగువ ప్రాంతాల్లో కురుస్తున్న భారీ వర్షాల ప్రభావంతో గోదావరి పరివాహక ప్రాంతంలోని వాగులు, వంకలు ఉప్పొంగి ప్రవహిస్తున్నాయి. జలాశయాలు నిండుకుండలను తలపిస్తుండటంతో ఆయా ప్రాజెక్టుల నుంచి దిగువకు వరద నీటిని విడుదల చేస్తున్నారు. దీంతో భద్రాచలం వద్ద గోదావరి ప్రవాహం ఒక్కసారిగా పెరిగి జలకళను సంతరించుకుంది. మొన్నటి వరకు సాధారణ స్థాయిలో ప్రవహించిన గోదావరి ప్రస్తుతం రెండు ఒడ్లను తాకుతూ ఉద్ధృతంగా ప్రవహిస్తోంది.



బుధవారం సుమారు 16 అడుగుల వద్ద నమోదైన గోదావరి నీటిమట్టం గురువారం సాయంత్రానికి 28.40 అడుగులకు చేరింది. దీంతో వరద నీరు శ్రీ సీతారామచంద్రస్వామి దేవస్థానం సమీపంలోని గోదావరి కరకట్ట, స్నాన ఘట్టాల వరకు చేరింది. ఎగువ ప్రాంతాల్లో వర్షాలు కొనసాగుతుండటంతో రానున్న రోజుల్లో నీటిమట్టం మరింత పెరిగే అవకాశం ఉందని అధికారులు అంచనా వేస్తున్నారు.

### ♦ అప్రమత్తమైన జిల్లా యంత్రాంగం..

గోదావరి వరద పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని జిల్లా యంత్రాంగం పూర్తి స్థాయిలో అప్రమత్తమైంది. వరద ముంపు ప్రాంతాల్లో తీసుకోవాల్సిన జాగ్రత్తలు, సహాయక చర్యలపై జిల్లా ఇన్‌చార్జి మంత్రులు తుమ్మల నాగేశ్వరరావు, భట్టి విక్రమార్క, పొంగులేటి శ్రీనివాసరెడ్డి సమీక్ష నిర్వహించి అధికారులకు అవసరమైన ఆదేశాలు జారీ చేశారు. జిల్లా కలెక్టర్, జిల్లా ఎస్పీ ఎప్పటికప్పుడు సంబంధిత శాఖల అధికారులతో సమన్వయం చేసుకుంటూ గోదావరి పరిస్థితిని పర్యవేక్షిస్తున్నారు. అలాగే ప్రమాద హెచ్చరికలపై నిరంతరం నిఘా ఉంచుతున్నారు. గోదావరి నీటిమట్టం 43 అడుగులకు చేరితే మొదటి ప్రమాద హెచ్చరిక, 48 అడుగులకు చేరితే రెండో ప్రమాద హెచ్చరిక, 53 అడుగులకు చేరితే మూడో ప్రమాద హెచ్చరిక జారీ చేస్తారు. ప్రస్తుతం నీటిమట్టం ప్రమాద స్థాయికి దిగువనే ఉన్నప్పటికీ ఎగువ ప్రాంతాల నుంచి వస్తున్న ప్రవాహాన్ని దృష్టిలో ఉంచుకుని అధికారులు పరిస్థితిని ఎప్పటికప్పుడు పరిశీలిస్తున్నారు.

### ♦ ప్రజలకు సూచనలు..

జిల్లాలో కురుస్తున్న వర్షాల కారణంగా పలు ప్రాంతాల్లో వాగులు, వంకలు పొంగిపొర్లుతున్నందున ప్రజలు ఎట్టి పరిస్థితుల్లోనూ వాటిని దాటేందుకు ప్రయత్నించవద్దని అధికారులు హెచ్చరిస్తున్నారు. అలాగే గోదావరి, ఇతర జలాశయాల్లో జాలరులు చేపల వేటకు వెళ్లరాదని సూచించారు. ముఖ్యంగా వరద ముంపు ప్రాంతాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, అధికారుల సూచనలను తప్పనిసరిగా పాటించాలని, అత్యవసర పరిస్థితుల్లో వెంటనే స్థానిక అధికారులకు సమాచారం అందించాలని జిల్లా యంత్రాంగం విజ్ఞప్తి చేసింది. ప్రస్తుతం గోదావరి ఉప్పొంగడం రైతుల్లో కొత్త ఆశలు నింపుతోంది. సాగునీటి వనరులు సమృద్ధిగా లభిస్తాయనే ఆనందం ఒకవైపు కనిపిస్తుండగా, వరద పరిస్థితులు తీవ్రరూపం దాల్చకుండా ఉండాలని మరోవైపు ప్రజలు కోరుకుంటున్నారు. ఎగువ ప్రాంతాల్లో వర్షాలు కొనసాగుతున్న నేపథ్యంలో గోదావరి ప్రవాహం మరింత పెరిగే అవకాశం ఉండటంతో భద్రాచలం వద్ద పరిస్థితిని అధికారులు ఎప్పటికప్పుడు నిశితంగా పరిశీలిస్తున్నారు.

## భారీ వర్షాల నేపథ్యంలో అన్ని శాఖలు అప్రమత్తంగా ఉండాలి




**కొత్తగూడెం కలెక్టరేట్, జులై 30, (ప్రజాజ్యోతి )** రాష్ట్రంలో కురుస్తున్న భారీ వర్షాల నేపథ్యంలో అన్ని జిల్లాల యంత్రాంగం పూర్తి అప్రమత్తంగా ఉండి ముందస్తు చర్యలు చేపట్టాలని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు ఆదేశించారు. గురువారం హైదరాబాద్ నుండి రాష్ట్ర డైరెక్టర్ జనరల్ ఆఫ్ పోలీస్ (డీజీపీ) సి.వి. ఆనంద్, ఇతర ఉన్నతాధికారులతో కలిసి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా జిల్లా కలెక్టర్లు, పోలీసు ఉన్నతాధికారులు, సంబంధిత శాఖల అధికారులతో రాష్ట్రంలోని వర్ష పరిస్థితులు, వరద నివారణ చర్యలు, ముందస్తు సన్నద్ధతపై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి మాట్లాడుతూ ప్రతి జిల్లాలో 24×7 కంట్రోల్ రూమ్‌లు నిరంతరం పనిచేసేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. రాష్ట్ర విపత్తు స్పందన దళం , జాతీయ విపత్తు స్పందన దళం బృందాలను వరద ప్రభావిత ప్రాంతాల్లో ఇప్పటికే మోహరించి అప్రమత్తంగా ఉంచినట్లు తెలిపారు. సమాచార వ్యవస్థలు, కమ్యూనికేషన్ నెట్‌వర్క్‌లు ఎలాంటి అంతరాయం లేకుండా పనిచేసేలా చూడాలని, కూలిపోయే ప్రమాదం ఉన్న పాత భవనాలను గుర్తించి తగిన జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. నీటిపారుదల శాఖ అధికారులతో సమన్వయం కొనసాగిస్తూ జలాశయాలు, చెరువులు, వాగుల పరిస్థితిని ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలని, లోతట్టు ప్రాంతాల్లో నివసించే ప్రజలను అవసరమైతే ముందస్తుగా సురక్షిత ప్రాంతాలకు తరలించాలని తెలిపారు. రహదారులపై రాకపోకలకు అంతరాయం కలగకుండా తక్షణ చర్యలు చేపట్టాలని, అత్యవసర పరిస్థితులను ఎదుర్కొనేందుకు ర్యాపిడ్ యాక్షన్ ప్లాన్ సిద్ధంగా ఉంచాలని సూచించారు. పోలీసు శాఖతో సమన్వయంగా క్షేత్రస్థాయి తనిఖీలు నిర్వహిస్తూ "జీరో క్యాజువాలిటీస్" లక్ష్యంగా అన్ని శాఖలు సమిష్టిగా పనిచేయాలని ఆదేశించారు. రాష్ట్ర డీజీపీ సి.వి. ఆనంద్ మాట్లాడుతూ జిల్లా పోలీసు అధికారులు స్టాండర్డ్ ఆపరేటింగ్ ప్రొసీజర్ (ఎస్ఓపీ)ను తప్పనిసరిగా అమలు చేయాలని సూచించారు. రాష్ట్రవ్యాప్తంగా 12 ఎస్‌డీఆర్‌ఎఫ్ బృందాలు సిద్ధంగా ఉన్నాయని, అవసరమైతే ఎన్‌డీఆర్‌ఎఫ్ బృందాలను కూడా వెంటనే సహాయక చర్యలకు వినియోగించేలా ఏర్పాట్లు చేసినట్లు తెలిపారు. ప్రజల ప్రాణ, ఆస్తుల రక్షణకు అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలని జిల్లా పోలీసు అధికారులను ఆదేశించారు. ఐడిఓసి కార్యాలయం నుండి వీడియో కాన్ఫిడెన్స్ లో పాల్గొన్న జిల్లా కలెక్టర్ అంకిత్ మాట్లాడుతూ భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో భారీ వర్షాల నేపథ్యంలో జిల్లా యంత్రాంగం పూర్తిస్థాయిలో అప్రమత్తంగా పనిచేస్తోందని తెలిపారు. వరద ప్రభావిత ప్రాంతాలను ముందుగానే గుర్తించి అవసరమైన రక్షణ చర్యలు చేపట్టినట్లు చెప్పారు. జిల్లాకు కేటాయించిన ఎన్‌డీఆర్‌ఎఫ్, ఎస్‌డీఆర్‌ఎఫ్ బృందాలతో సమన్వయం కొనసాగిస్తూ అవసరమైన ప్రాంతాల్లో సహాయక చర్యలకు సిద్ధంగా ఉన్నామని తెలిపారు. జిల్లాలోని గోదావరి, కిన్నెరసాని, తాలిపేరు, నదుల పరివాహక ప్రాంతాలు, వాగులు, కల్వర్టులు, లోతట్టు ప్రాంతాల వద్ద ప్రత్యేక నిఘా ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ప్రమాదకర ప్రాంతాల్లో రెవెన్యూ, పోలీసు, పంచాయతీరాజ్, అగ్నిమాపక శాఖల సిబ్బందిని మోహరించి ప్రజలు నీటి ప్రవాహాల్లోకి వెళ్లకుండా చర్యలు చేపట్టామని చెప్పారు. శిథిలావస్థలో ఉన్న భవనాలను గుర్తించి అవసరమైతే అక్కడి ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలించే ఏర్పాట్లు చేస్తున్నామని, పునరావాస కేంద్రాలను సిద్ధంగా ఉంచి తాగునీరు, ఆహారం, విద్యుత్, వైద్య సేవలు, పారిశుద్ధ్య సౌకర్యాలు కల్పించేలా అన్ని శాఖలను అప్రమత్తం చేసినట్లు తెలిపారు. జిల్లా స్థాయిలో 24 గంటల కంట్రోల్ రూమ్ ద్వారా పరిస్థితిని నిరంతరం పర్యవేక్షిస్తూ ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అన్ని శాఖలు సమన్వయంతో పనిచేస్తున్నట్లు జిల్లా కలెక్టర్ తెలిపారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ వేణుగోపాల్, జడ్పీ సీఈవో నాగలక్ష్మి , డిఆర్ఓ పద్మావతి, వ్యవసాయ శాఖ అధికారి బాబురావు, జిల్లా పంచాయతీ శాఖ అధికారి అనూష, సంబంధిత శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

- నియోజకవర్గంలోని అన్ని శాఖల అధికారులు అందుబాటులో ఉండాలి
- వరద ముంపుకు గురయ్యే ప్రాంతాల్లో ప్రత్యేక నిఘా ఏర్పాటు చేయాలి
- సీజనల్ వ్యాధులు ప్రబల కుండా వైద్య శాఖ అప్రమత్తంగా ఉండాలి
- పినపాక ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు

**మణుగూరు, జూలై 30 (ప్రజాజ్యోతి) :** భారీ వర్షాల నేపథ్యంలో పినపాక నియోజకవర్గ ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, రానున్న 36 గంటల్లో భారీ నుంచి అతి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణ శాఖ హెచ్చరికలు జారీ చేసిన నేపథ్యంలో నియోజకవర్గ ప్రజలందరూ అత్యంత అప్రమత్తంగా ఉండాలని పినపాక ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. భారీ వర్షాల ప్రభావంతో లోతట్టు ప్రాంతాలు, వాగులు, వంకలు, కాలువలు పొంగిపొర్లే అవకాశం ఉన్నందున ప్రజలు అత్యవసరమైతే తప్ప అనవసర ప్రయాణాలు మానుకొని తగు జాగ్రత్తలు పాటించాలని కోరారు. ముఖ్యంగా పిల్లలు, వృద్ధులు, గర్భిణీలు అత్యంత అప్రమత్తంగా ఉండాలని సూచించారు. నియోజకవర్గంలోని అన్ని మండలాల అధికారులు, ప్రజాప్రతినిధులు, గ్రామ పంచాయతీ సిబ్బంది, రెవెన్యూ, పోలీసు, వైద్య, విద్యుత్, పంచాయతీరాజ్, గ్రామీణ నీటి సరఫరా తదితర శాఖల అధికారులు తమ కార్యస్థానాల్లో అందుబాటులో ఉండాలని ఆదేశించారు. ఎలాంటి అత్యవసర పరిస్థితులనైనా వెంటనే స్పందించి ప్రజలకు సహాయం అందించాలని ఎమ్మెల్యే తెలిపారు. వరద ముంపునకు గురయ్యే ప్రాంతాలను ముందే గుర్తించి ప్రత్యేక నిఘా ఏర్పాటు చేసి, అవసరమైతే ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలించే చర్యలు చేపట్టాలని అధికారులకు ఉపదేశించారు. వాగులు, వంకలు, చెరువులు, కాలువలు ఉప్పొంగుతున్న సమయంలో వాటిని దాటేందుకు ఎట్టి పరిస్థితుల్లోనూ ప్రయత్నించవద్దని ప్రజలకు విజ్ఞప్తి చేశారు. భారీ వర్షాల వల్ల విద్యుత్ సరఫరా, తాగునీటి సరఫరా, రవాణా వ్యవస్థలకు అంతరాయం ఏర్పడే అవకాశం ఉన్నందున సంబంధిత శాఖలు ముందస్తు చర్యలు తీసుకుని ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చూడాలని తెలిపారు. గ్రామాల్లో పారిశుద్ధ్యంపై ప్రత్యేక దృష్టి సారించి, సీజనల్ వ్యాధులు ప్రబలకుండా వైద్య శాఖ అప్రమత్తంగా ఉండాలని అన్నారు. వ్యవసాయ శాఖ అధికారులు రైతులకు పంటల సంరక్షణపై ఎప్పటికప్పుడు సూచనలు అందించాలని, పశుసంవర్ధక శాఖ అధికారులు పశువుల రక్షణకు అవసరమైన చర్యలు చేపట్టాలని కోరారు. అత్యవసర పరిస్థితుల్లో ప్రజలకు తక్షణ సహాయం అందేలా అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. నియోజకవర్గ ప్రజల ప్రాణాలు, ఆస్తుల రక్షణే తమ ప్రభుత్వ ప్రథమ ప్రాధాన్యతని పేర్కొన్నారు. ఎలాంటి అత్యవసర పరిస్థితి తలెత్తినా స్థానిక అధికారులకు వెంటనే సమాచారం అందించి, అధికారుల సూచనలు తప్పనిసరిగా పాటించాలని ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు ప్రజలకు విజ్ఞప్తి చేశారు.



## అన్నపురెడ్డిపల్లికి అదనంగా 300 ఇందిరమ్మ ఇళ్ల మంజూరుకు వినతి

- మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డికి గ్రామ ప్రతినిధుల వినతిపత్రం



**అన్నపురెడ్డిపల్లి, జూలై 30 (ప్రజా జ్యోతి):** అన్నపురెడ్డిపల్లి మండల కేంద్రంలో గురువారం పర్యటించిన రాష్ట్ర రెవెన్యూ, గృహ నిర్మాణ శాఖ, సమాచార & ప్రజాసంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డిని గ్రామ ప్రతినిధులు కలిసి వినతిపత్రం అందజేశారు. ఇందిరమ్మ గృహ నిర్మాణ పథకం కింద అన్నపురెడ్డిపల్లి గ్రామానికి అదనంగా 300 ఇళ్లను మంజూరు చేయాలని కోరారు. గ్రామంలో సుమారు 10 వేల మంది జనాభా నివసిస్తున్నారని, వారిలో అధిక శాతం మంది ఎస్టీలు, ఇతర బలహీన వర్గాలకు చెందిన వారేనని వినతిపత్రంలో పేర్కొన్నారు. అనేక నిరుపేద కుటుంబాలు ఇప్పటికీ కచ్చా ఇళ్లలో నివసిస్తూ ఇబ్బందులు ఎదుర్కొంటున్నందున అర్హులైన ప్రతి పేద కుటుంబానికి పక్కా ఇల్లు అందేలా అదనంగా 300 ఇందిరమ్మ ఇళ్లను మంజూరు చేయాలని మంత్రిని విజ్ఞప్తి చేశారు. వినతిపత్రం అందజేసిన వారిలో గ్రామ సర్పంచ్ లకావత్ లక్ష్మి , ఉప సర్పంచ్ మారగాని అశోక్, చల్లా రమేష్, సుగ్గల నరసింహా రావు, పంచాయతీ పాలకవర్గ సభ్యులు పాల్గొన్నారు.

## అద్దె భవనంలోనే ఎమ్మార్వో కార్యాలయం... సొంత భవనం ఎప్పుడో?

- వర్షం వస్తే గదుల్లోకి నీరు... అవస్థల్లో సిబ్బంది
- ఇబ్బందులు పడుతున్న ప్రజలు... శాశ్వత భవనం కోసం ఎదురుచూపులు





**అన్నపురెడ్డిపల్లి, జూలై 30 (ప్రజా జ్యోతి):** అన్నపురెడ్డిపల్లి మండల కేంద్రంలోని ఎమ్మార్వో కార్యాలయం సొంత భవనం లేకపోవడంతో ఏళ్లుగా అద్దె భవనంలోనే కొనసాగుతోంది. వర్షం కురిసిన ప్రతిసారి పైకప్పు నుంచి గదుల్లోకి నీరు కారుతుండటంతో కార్యాలయ సిబ్బంది తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. భయాందోళనల మధ్యే విధులు నిర్వహించాల్సిన పరిస్థితి నెలకొంది. కూర్చునేందుకు కూడా సరైన వసతులు లేక ఉద్యోగులు అవస్థలు పడుతున్నారు. ముఖ్యమైన ప్రభుత్వ రికార్డులు, దస్త్రాలు తడిసిపోతాయేమోనన్న ఆందోళన కూడా వ్యక్తమవుతోంది. మండలంలోని ప్రజలు ఆదాయ, కుల, నివాస ధ్రువీకరణ పత్రాలు సహా వివిధ రెవెన్యూ సేవల కోసం ప్రతిరోజూ ఎమ్మార్వో కార్యాలయానికే వస్తుంటారు. అయితే కార్యాలయం అధ్వాన్న స్థితిలో ఉండటంతో ప్రజలు కూడా అసౌకర్యానికి గురవుతున్నారు. మండల కేంద్రానికి తగిన విధంగా అన్ని సౌకర్యాలతో కూడిన శాశ్వత ఎమ్మార్వో కార్యాలయ భవనాన్ని నిర్మించాలని ప్రజలు, సిబ్బంది కోరుతున్నారు. అప్పటి వరకు ప్రస్తుతం ఉన్న భవనానికి మరమ్మతులు చేపట్టి వర్షాకాలంలో ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకోవాలని ప్రభుత్వాన్ని విజ్ఞప్తి చేస్తున్నారు.

## 'జలసిరి'ని విజయవంతం చేయాలి

- భూగర్భ జలాల పెంపే లక్ష్యం: ఎంపీడీఓ సంకీర్త్




**పినపాక, జూలై 30(ప్రజాజ్యోతి)** వర్షపు నీటిని ఒడిసిపట్టి భూగర్భ జలాలను పెంపొందించడమే రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన ప్రతిష్ఠాత్మక 'జలసిరి' కార్యక్రమం లక్ష్యమని ఎంపీడీఓ సంకీర్త్ అన్నారు. గురువారం పినపాక మండలంలో 11 గ్రామ పంచాయతీలలో నిర్వహించిన గ్రామసభలో సర్పంచులు అవగాహన కల్పించారు. సీతంపేట గ్రామ సభలో ఎంపీడీవో మాట్లాడుతూ ఎల్‌నినో ప్రభావంతో ఏర్పడే వర్షాభావ పరిస్థితులను ఎదుర్కొనేందుకు ప్రతి ఇంటి వద్ద ఇంకుడు గుంతలు, పంటకుంటలు నిర్మించాలని పిలుపునిచ్చారు. ఉపాధి హామీ పథకం ద్వారా ఈ పనులకు ప్రభుత్వం పూర్తి సహకారం అందిస్తోందన్నారు. గ్రామాల్లో పంచాయతీ, అంగన్‌వాడీ, మహిళా సంఘాల భవనాల నిర్మాణంతో పాటు రైతుల వ్యక్తిగత ఆస్తుల అభివృద్ధికి ప్రాధాన్యం ఇస్తున్నట్లు తెలిపారు. తో గూడెం గ్రామ పంచాయతీలో పరిధిలోని ప్రతి గ్రామంలో త్వరలో విద్యుత్ స్తంభాలు ఏర్పాటు చేస్తామని స్థానిక సర్పంచ్ వెంకటేశ్వర్లు హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా పలు గ్రామపంచాయతీలో సర్పంచులు మాట్లాడుతూ పంచాయతీ లను ఆదర్శ పంచాయతీగా తీర్చిదిద్దేందుకు అధికారులు, ప్రజాప్రతినిధులు, మహిళా సంఘాలు, రైతులు, గ్రామస్థులు సమిష్టిగా కృషి చేయాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఎంపీవో వెంకటేశ్వర్లు, వివిధ గ్రామ పంచాయతీల సర్పంచ్ లు సెక్రటరీలు, వివిధ శాఖల లైన్ డిపార్ట్మెంట్ అధికారులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

## బి.ఎల్.ఓ లు, బి.ఎల్.ఏ లు ప్రతి ఓటును ప్రతిష్టాత్మకంగా తీసుకోవాలి

- పాత పాల్వంచలో సర్ ను పరిశీలించిన కొత్వాల, కార్పొరేటర్ విమలాదేవి



**కొత్తగూడెం కలెక్టరేట్, జులై 30,(ప్రజా జ్యోతి)** ప్రతి పోలింగ్ బూత్ లో బి.ఎల్.ఓ లు, బి.ఎల్.ఎ లు ప్రతి ఓటును ప్రతిష్టాత్మకంగా తీసుకోవాలని డీ.సీ.ఎం.ఎస్ మాజీ చైర్మన్, రాష్ట్ర మార్క్ఫెడ్ మాజీ డైరెక్టర్, పాల్వంచ సొసైటీ అధ్యక్షులు కొత్వాల శ్రీనివాసరావు అన్నారు. గురువారం పాత పాల్వంచ 46వ డివిజన్ పరిధిలోని 77, 78 పోలింగ్ బూత్ లలో ఓటర్ నమోదును కార్పొరేటర్ కొత్వాల విమలాదేవితో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా కొత్వాల మాట్లాడుతూ ఎన్నికల కమిషన్ చేపట్టిన ఓటరు ప్రత్యేక సమగ్ర సవరణ సర్ కార్యక్రమానికి ఆఖరి గడువు సమీపిస్తున్నందున నమోదు ప్రక్రియను వేగవంతం చేయాలని కొత్వాల అన్నారు. అర్హులైన వారి ఓట్లు తొలగిపోకుండా బి.ఎల్.ఓ లు, బి.ఎల్.ఎ లు అప్రమత్తంగా ఉండాలని అన్నారు. ఈ కార్యక్రమంలో 46వ డివిజన్ కార్పొరేటర్ కొత్వాల విమలాదేవి, 46వ డివిజన్ సి.పి.ఐ పార్టీ ఇంచార్జ్ రహ్మాన్, బి.ఎల్.ఓ లు చందార్కర్,వరుణ్ బి.ఎల్.ఏ లు షేక్ ఖాజా మీయా, మసనం శరత్, డివిజన్ నాయకులు సయ్యద్ కరీం, షేక్ నజీర్ యాటా నాని, బూసి శ్రీను, ధర్మరాజుల రమేష్, కలీమ్ చావా సామ్రాజ్యం, నాని, సాయి, వీరయ్య, రాము తదితరులు పాల్గొన్నారు.

## వైభవంగా శ్రీ సుదర్శన హోమం

- శ్రవణ నక్షత్రాన్ని పురస్కరించుకుని ప్రత్యేక పూజలు



**అన్నపురెడ్డిపల్లి, జూలై 30 (ప్రజా జ్యోతి):** అన్నపురెడ్డిపల్లి మండల కేంద్రంలో గల శ్రీ బాలాజీ వెంకటేశ్వర స్వామి దేవస్థానంలో గురువారం శ్రవణ నక్షత్రాన్ని పురస్కరించుకుని శ్రీ సుదర్శన హోమం వైభవంగా నిర్వహించారు. ఆలయ మేనేజర్ పి.వి. రమణ పర్యవేక్షణలో వేదపండితులు వేదమంత్రోచ్చారణల నడుమ శాస్త్రోక్తంగా హోమ కార్యక్రమాన్ని నిర్వహించారు. అనంతరం స్వామివారికి ప్రత్యేక అభిషేకాలు, అర్చనలు, నైవేద్య సమర్పణ చేపట్టారు. హోమంలో పాల్గొన్న భక్తులు స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తుల ఆయురారోగ్యాలు, సుఖశాంతులు, ఐశ్వర్యాభివృద్ధి, లోకక్షేమం కోసం ప్రత్యేక ప్రార్థనలు చేశారు. అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలు పంపిణీ చేశారు. కార్యక్రమం ఆద్యంతం భక్తిశ్రద్ధలతో, ఆధ్యాత్మిక వాతావరణంలో కొనసాగింది. ఈ కార్యక్రమంలో ఆలయ సిబ్బంది, వేదపండితులు, పలువురు భక్తులు పాల్గొని స్వామివారి ఆశీస్సులు పొందారు.

## రాష్ట్రస్థాయి అండర్-13 చెస్ పోటీలకు జిల్లా స్థాయి ఎంపికలు

- ఆగస్టు 2న కొత్తగూడెంలో నిర్వహణ
- అండర్-10 జిల్లా చెస్ ఛాంపియన్‌షిప్ కూడా అదే రోజు



**కొత్తగూడెం, జూలై 30, ప్రజాజ్యోతి :** రాష్ట్రస్థాయి అండర్-13 చెస్ పోటీలకు భద్రాద్రి కొత్తగూడెం జిల్లా జట్టును ఎంపిక చేసేందుకు జిల్లా చెస్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఆగస్టు 2న జిల్లా స్థాయి ఎంపికల పోటీలు నిర్వహించనున్నట్లు జిల్లా చెస్ అసోసియేషన్ అధ్యక్షుడు చెల్లా భాస్కరరావు, కార్యదర్శి సీహెచ్ గోపికృష్ణ సంయుక్త ప్రకటనలో తెలిపారు. కొత్తగూడెం పట్టణంలోని మేదరబస్తీలో ఉన్న డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ ఐటీఐలో ఈ ఎంపికల పోటీలు ఒక రోజు పాటు జరుగుతాయని తెలిపారు. బాలురు, బాలికలకు వేర్వేరుగా పోటీలు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. ఈ పోటీల్లో ప్రతిభ కనబరిచిన ఇద్దరు బాలురు, ఇద్దరు బాలికలను ఎంపిక చేసి రాష్ట్రస్థాయి అండర్-13 చెస్ పోటీలకు జిల్లా తరపున పంపనున్నట్లు తెలిపారు. అదే రోజు అండర్-10 బాలబాలికల జిల్లా స్థాయి చెస్ ఛాంపియన్‌షిప్ పోటీలను కూడా నిర్వహిస్తున్నట్లు జిల్లా చెస్ అసోసియేషన్ ట్రెజరర్ రంజిత్ కుమార్ తెలిపారు. పోటీలు స్విస్ లీగ్ విధానంలో నిర్వహించబడతాయని పేర్కొన్నారు. విజేతలకు డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ ఐటీఐ డైరెక్టర్ కె. వెలన్ కుమార్ ట్రోఫీలు అందజేయనున్నట్లు తెలిపారు. ఈ పోటీల్లో పాల్గొనదలిచిన క్రీడాకారులు మరిన్ని వివరాల కోసం 94401 62749 నంబర్‌ను సంప్రదించాలని జిల్లా చెస్ అసోసియేషన్ కార్యదర్శి సీహెచ్ గోపికృష్ణ కోరారు.

## శ్రీ రామచంద్ర ప్రభుత్వ డిగ్రీ కళాశాలకు యూజీసీ అటానమస్ హోదా

- 2026-27 నుంచి ఐదేళ్లపాటు స్వయంప్రతిపత్తి
- విద్యా ప్రమాణాల పెంపునకు కీలక అడుగు



**కొత్తగూడెం, జూలై 30, ప్రజాజ్యోతి :** భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కొత్తగూడెంలోని శ్రీ రామచంద్ర ప్రభుత్వ డిగ్రీ కళాశాలకు విశ్వవిద్యాలయ మంజూరి సంఘం (యూజీసీ) ప్రతిష్ఠాత్మకమైన అటానమస్ (స్వయంప్రతిపత్తి) హోదాను మంజూరు చేసింది. ఈ హోదా 2026-27 విద్యా సంవత్సరం నుంచి 2030-31 విద్యా సంవత్సరం వరకు ఐదేళ్లపాటు అమల్లో ఉండనున్నట్లు కళాశాల యాజమాన్యం వెల్లడించింది. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ ఆచార్య పి. పద్మ హర్షం వ్యక్తం చేశారు. కళాశాల అభివృద్ధికి నిరంతరం కృషి చేసిన అధ్యాపక బృందం, బోధనేతర సిబ్బంది, విద్యార్థులు, పూర్వ విద్యార్థులు, సీపీడీసీ సభ్యులు, తల్లిదండ్రులు, అలాగే ఉన్నత విద్యాశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ యోగితా రాణా, కాలేజియేట్ ఎడ్యుకేషన్ కమిషనర్ దేవసేన అందించిన సహకారంతోనే ఈ గుర్తింపు సాధ్యమైందని పేర్కొన్నారు. కళాశాల ఐక్యూఏసీ కో-ఆర్డినేటర్, అసోసియేట్ ప్రొఫెసర్ డా. ఎం. పూర్ణచంద్రరావు మాట్లాడుతూ, అటానమస్ హోదాతో సమకాలీన అవసరాలకు అనుగుణంగా పాఠ్య ప్రణాళికలను రూపొందించుకునే స్వేచ్ఛ లభిస్తుందని తెలిపారు. నైపుణ్యాధారిత కోర్సులు, వినూత్న బోధనా విధానాలు, పరిశోధనకు ప్రాధాన్యం, ఉపాధి అవకాశాలకు అనుసంధానమైన విద్యను అందించే అవకాశాలు మరింత విస్తృతమవుతాయని చెప్పారు. ఈ హోదా కళాశాల విద్యా ప్రమాణాలను మరింత ఉన్నత స్థాయికి తీసుకెళ్లే కీలక మైలురాయిగా నిలుస్తుందని అభిప్రాయపడ్డారు. యూజీసీ అటానమస్ హోదా లభించడం ద్వారా శ్రీ రామచంద్ర ప్రభుత్వ డిగ్రీ కళాశాల విద్యా రంగంలో మరో చారిత్రక విజయాన్ని నమోదు చేసుకుందని కళాశాల యాజమాన్యం పేర్కొంది. భవిష్యత్తులో నాణ్యమైన ఉన్నత విద్య, పరిశోధన, ఆవిష్కరణలకు కేంద్రంగా కళాశాలను తీర్చిదిద్దేందుకు యాజమాన్యం, అధ్యాపకులు సమిష్టిగా కృషి చేస్తామని వెల్లడించారు.

# ప్రాణాలు తీస్తామంటున్న గుంతలు..

- చూస్తూ ఊరుకుంటున్న ఆర్‌అండ్‌బీ..!
- మణుగూరు-ఏటూరు నాగారం ప్రధాన రహదారి అధ్వాన్నం
- వర్షాలతో మరింత ప్రమాదకరం
- రెడ్డిగూడెం వద్ద కుంగిపోయిన కల్వర్టు
- గొట్టెల, పాండురంగపురం, జానంపేట, దుగినేపల్లి పరిధిలో భారీ గుంతలు
- ప్రజలే ప్రమాద సూచికలు ఏర్పాటు చేసిన దుస్థితి..
- మరమ్మతులు చేపట్టాలని డిమాండ్







**పినపాక, జూలై 30 (ప్రజాజ్యోతి):** మణుగూరు-ఏటూరునాగారం ప్రధాన రహదారి పినపాక మండల పరిధిలో పూర్తిగా అధ్వాన్నంగా మారింది. గొట్టెల, పాండురంగపురం, జానంపేట, దుగినేపల్లి గ్రామాల పరిధిలో అనేక చోట్ల భారీ గుంతలు ఏర్పడటంతో ప్రతి రోజూ వేలాది మంది ప్రయాణికులు ప్రాణాలను అరచేతిలో పెట్టుకుని ప్రయాణించాల్సిన పరిస్థితి నెలకొంది. దుగినేపల్లి గ్రామపంచాయతీ పరిధిలోని రెడ్డిగూడెం సమీపంలో కల్వర్టు కుంగిపోవడంతో పరిస్థితి మరింత ప్రమాదకరంగా మారింది. ప్రస్తుతం కురుస్తున్న వర్షాల కారణంగా గుంతలు పూర్తిగా నీటితో నిండిపోవడంతో వాటి లోతు అంచనా వేయలేని పరిస్థితి ఏర్పడింది. రాత్రి వేళల్లో ఈ మార్గంలో ప్రయాణించడం అత్యంత ప్రమాదకరంగా మారిందని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

### అధికారులు స్పందించక పోవడంతో ప్రజలే రంగంలోకి....

రెడ్డిగూడెం సమీపంలోని ప్రమాదకర గుంత వద్ద ప్రమాదాలు జరగకుండా స్థానిక గ్రామస్తులు స్వచ్ఛందంగా కర్రకు ఫ్లెక్స్ కట్టి హెచ్చరిక సూచిక ఏర్పాటు చేశారు. ప్రజలే భద్రతా చర్యలు తీసుకోవాల్సిన పరిస్థితి రావడం అధికార యంత్రాంగం నిర్లక్ష్యానికి అద్దం పడుతోందని గ్రామస్తులు మండిపడుతున్నారు.

### భారీ వాహనాలే కారణమా..?

ఈ మార్గంలో అధిక లోడుతో ఇసుక, బొగ్గు లారీలు నిరంతరం రాకపోకలు సాగించడం వల్లే రహదారి పూర్తిగా దెబ్బతిన్నదని స్థానికులు ఆరోపిస్తు న్నారు. భారీ వాహనాల ఒత్తిడితో రో డ్డు కుంగిపోవడం, వర్షాలతో గుంతలు మరింత విస్తరించడం వల్ల ప్రమాదాలు పెరుగుతున్నాయని చెబుతున్నారు.

### ప్రమాదం జరిగాకే చర్యలా..?

ప్రధాన రహదారిపై భారీ గుంతలు ఏర్పడి నెలలు గడుస్తున్నా సంబంధిత ఆర్‌అండ్‌బీ శాఖ అధికారులు కనీసం తాత్కాలిక మరమ్మతులు కూడా చేపట్టకపోవడంపై ప్రజలు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. "ప్రమాదం జరిగాకే అధికారులు స్పందిస్తారా?", "ప్రజల ప్రాణాలకు విలువ లేదా?" అంటూ ప్రశ్నిస్తున్నారు. తక్షణమే మరమ్మతులు చేపట్టాలి. రెడ్డిగూడెం సమీపంలోని కుంగిపోయిన కల్వర్టుకు అత్యవసర మరమ్మతులు చేపట్టడంతో పాటు, మణుగూరు-ఏటూరునాగారం ప్రధాన రహదారిపై ఏర్పడిన గుంతలను వెంటనే పూడ్చి శాశ్వత మరమ్మతులు చేపట్టాలని ప్రజలు, ప్రయాణికులు, వాహనదారులు ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తున్నారు.

## మండలంలో ఎస్ఐఆర్ కార్యక్రమాన్ని పరిశీలించిన ఎమ్మెల్యే కోరం కనకయ్య

- అర్హులందరికీ ఓటు హక్కు కల్పించాలి..
- ప్రత్యేక ఓటరు జాబితా సవరణ పారదర్శకంగా నిర్వహించాలి
- బీఎల్‌వోలు, బీఎల్‌ఏలతో సమీక్ష.. పెండింగ్ దరఖాస్తులను వెంటనే పరిష్కరించాలని ఆదేశం







**టేకులపల్లి, జూలై 30, ప్రజాజ్యోతి:** ప్రత్యేక ఓటరు జాబితా సవరణ ప్రక్రియను పారదర్శకంగా, నిబంధనలకు అనుగుణంగా నిర్వహించి అర్హులైన ప్రతి ఒక్కరికీ ఓటు హక్కు కల్పించాలని ఇల్లందు శాసనసభ్యులు కోరం కనకయ్య అధికారులను ఆదేశించారు. గురువారం నియోజకవర్గ ఇంచార్జి, తెలంగాణ గిడ్డంగుల సంస్థ చైర్మన్ రాయల నాగేశ్వరరావుతో కలిసి టేకులపల్లి మండలంలోని బోడు, రామచంద్రుపేట, కొప్పురాయి, ఎర్రాయిగూడెం గ్రామ పంచాయతీల్లో జరుగుతున్న స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ (ఎస్ఐఆర్) కార్యక్రమాన్ని క్షేత్రస్థాయిలో పరిశీలించా రు. గ్రామాల్లో ప్రత్యేక ఓటరు జాబితా సవరణ ప్రక్రియ పురోగతిని సమీక్షించిన ఎమ్మెల్యే, కొత్త ఓటర్ల నమోదు, పేర్ల సవరణ, చేర్పులు, తొలగింపులపై అధికారులను అడిగి వివరాలు తెలుసుకున్నారు. అర్హత ఉన్న ఒక్క ఓటరు కూడా జాబితా నుంచి మినహాయించబడకుండా ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని సూచించారు. ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ఎన్నికల సంఘం మార్గదర్శకాల మేరకు పూర్తి పారదర్శకతతో కార్యక్రమాన్ని నిర్వహించాలని అధికారులను ఆదేశించారు. అనంతరం బీఎల్‌వోలు, బీఎల్‌ఏలతో సమావేశమై గ్రామాల వారీగా నమోదైన దరఖాస్తులు, వాటి పరిష్కార స్థితిపై సమీక్ష నిర్వహించారు. పెండింగ్‌లో ఉన్న దరఖాస్తులను త్వరితగతిన పరిష్కరించి, ఓటరు నమోదు ప్రక్రియను మరింత వేగవంతం చేయాలని సూచించారు. ప్రజలకు అవసరమైన అవగాహన కల్పిస్తూ ప్రతి అర్హుడి పేరు ఓటరు జాబితాలో నమోదయ్యేలా చర్యలు తీసుకోవాలని అధికారులకు దిశానిర్దేశం చేశారు. ఈ పర్యటన లో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు లక్కినేని శ్యామ్, మార్కెట్ కమిటీ చైర్మన్ రాంబాబు, జిల్లా కాంగ్రెస్ నాయకుడు కోరం సురేందర్, ఆత్మ కమిటీ చైర్మన్ మంగీలాల్, సర్పంచులు వాసం సువర్ణ, చింత కళ్యాణ్, పోదెం స్వరూప, ఊకె రమేష్, స్థానిక ప్రజా ప్రతినిధులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, బీఎల్‌వోలు, బీఎల్‌ఏలు, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

# గోదావరి వరదలపై అన్ని శాఖలు పూర్తి అప్రమత్తంగా ఉండాలి

- మొదటి ప్రమాద హెచ్చరిక జారీ అయ్యే అవకాశం నేపథ్యంలో ముందస్తు చర్యలు ముమ్మరం చేయాలి
- జిల్లా కలెక్టర్ అంకిత్



**కొత్తగూడెం కలెక్టరేట్, జులై 30, (ప్రజాజ్యోతి)** ఎగువ ప్రాంతాల్లో కురుస్తున్న భారీ వర్షాల కారణంగా గోదావరి నదికి వరద ప్రవాహం పెరుగుతున్న నేపథ్యంలో, శుక్రవారం ఉదయం నాటికి మొదటి ప్రమాద హెచ్చరిక జారీ అయ్యే అవకాశం ఉన్నందున జిల్లాలోని అన్ని శాఖల అధికారులు అప్రమత్తంగా ఉండి ముందస్తు చర్యలు చేపట్టాలని జిల్లా కలెక్టర్ అంకిత్ ఆదేశించారు.గోదావరి వరద పరిస్థితులు, చేపట్టాల్సిన ముందస్తు చర్యలపై గురువారం జిల్లా కలెక్టర్ అంకిత్ అన్ని శాఖల జిల్లా అధికారులతో టెలికాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, గోదావరిలో నీటి ప్రవాహం నిరంతరం పెరుగుతున్నందున పరిస్థితిని ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తూ అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాలన్నారు. గోదావరి పరివాహక ప్రాంతాల్లోని గ్రామాల ప్రజలను ముందుగానే అప్రమత్తం చేయాలని, గ్రామస్థాయిలో విస్తృతంగా అవగాహన కల్పించాలని, అవసరమైతే మైకుల ద్వారా హెచ్చరికలు జారీ చేయాలని సూచించారు.లోతట్టు ప్రాంతాల్లో నివసిస్తున్న ప్రజలను గుర్తించి అవసరమైతే ముందుగానే సురక్షిత పునరావాస కేంద్రాలకు తరలించేలా కార్యాచరణ సిద్ధం చేయాలని ఆదేశించారు. పునరావాస కేంద్రాల్లో తాగునీరు, విద్యుత్, పారిశుద్ధ్యం, మరుగుదొడ్లు, ఆహారం, వైద్య సేవలు, తాత్కాలిక వసతి తదితర అన్ని మౌలిక సదుపాయాలను ముందుగానే సిద్ధంగా ఉంచాలని సూచించారు. వృద్ధులు, చిన్నారులు, గర్భిణీలు, దివ్యాంగులకు అవసరమైన ప్రత్యేక సౌకర్యాలు కల్పించాలని అధికారులకు ఆదేశాలు జారీ చేశారు.మత్స్యశాఖ అధికారులు గజ ఈతగాళ్లు, బోట్లు, లైఫ్ జాకెట్లను సిద్ధంగా ఉంచాలని, అగ్నిమాపక శాఖ, పోలీసు, రెవెన్యూ, వైద్య ఆరోగ్య, పంచాయతీరాజ్, విద్యుత్ తదితర శాఖలు అత్యవసర పరిస్థితుల్లో వెంటనే స్పందించేలా సిబ్బందిని అందుబాటులో ఉంచాలని సూచించారు.గోదావరి స్నాన ఘాట్లు, పర్యాటక ప్రాంతాలు, నది తీర ప్రాంతాల్లో బ్యారికేడ్లు ఏర్పాటు చేసి ప్రజలు నదిలోకి వెళ్లకుండా పటిష్ట చర్యలు తీసుకోవాలని, పోలీసు శాఖ నిరంతర బందోబస్తు నిర్వహించాలని ఆదేశించారు. గోదావరి ప్రవాహం తగ్గే వరకు నదిలో చేపల వేట, పడవల రాకపోకలు, అనవసరంగా నది వద్దకు వెళ్లడాన్ని నియంత్రించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు.అధికారులు క్షేత్రస్థాయిలో నిరంతరం పర్యటిస్తూ పరిస్థితిని సమీక్షించాలని, వరద పరిస్థితులకు సంబంధించిన సమాచారాన్ని ఎప్పటికప్పుడు జిల్లా నియంత్రణ కేంద్రానికి అందించాలని, ప్రజల ప్రాణ, ఆస్తి రక్షణకు అత్యంత ప్రాధాన్యతనిస్తూ అన్ని ముందస్తు చర్యలను సమర్థవంతంగా అమలు చేయాలని జిల్లా కలెక్టర్ అంకిత్ స్పష్టం చేశారు. సాయంత్రం 6.00 గంటల నాటికి భద్రాచలం వద్ద గోదావరి నీటిమట్టం 28.40 అడుగులుగా నమోదైంది. ప్రస్తుతం నీటి ప్రవాహం 3,88,452 క్యూసెక్కులుగా ఉంది. మొదటి ప్రమాద హెచ్చరిక స్థాయి 43.00 అడుగులు కాగా, ఆ సమయంలో సుమారు 9,32,288 క్యూసెక్కుల ప్రవాహం నమోదయ్యే అవకాశం ఉంది. ఎగువ ప్రాంతాల్లో కురుస్తున్న వర్షాల నేపథ్యంలో గోదావరి నీటిమట్టం మరింత పెరిగే అవకాశం ఉన్నందున అధికారులు పరిస్థితిని నిరంతరం పర్యవేక్షిస్తూ అవసరమైన అన్ని ముందస్తు చర్యలు చేపట్టాలని అధికారులను కలెక్టర్ ఆదేశించారు.గోదావరి పరివాహక ప్రాంత ప్రజలు అధికారుల సూచనలు పాటిస్తూ అప్రమత్తంగా ఉండాలని కలెక్టర్ సూచించారు.

# మూకమామిడి ప్రాజెక్టుకు నీరు విడుదల చేయాలి



**ములకలపల్లి, జులై 30(ప్రజాజ్యోతి):** వర్షాభావంతో మూకమామిడి ప్రాజెక్టు చెరువు నిండకపోవడంతో ఆయకట్టు రైతులను ఆదుకునేందుకు సీతారామ ప్రాజెక్టు కాలువ నుంచి వెంటనే నీటిని విడుదల చేయాలని మూకమామిడి సర్పంచ్ కోర్సా ఆదిలక్ష్మి డిమాండ్ చేశారు. గురువారం రైతులతో కలిసి మండల తహసీల్దార్ స్వాతి బిందుకు వినతిపత్రం అందజేశారు. మూకమామిడి, చవిటిగూడెం గ్రామాల రైతులు ఇప్పటికే వేలాది ఎకరాల్లో వరి నారు పోశారని, నీటి కొరతతో తీవ్ర ఆందోళన చెందుతున్నారని తెలిపారు. ప్రభుత్వం వెంటనే స్పందించి సీతారామ ప్రాజెక్టు కాలువ నుంచి మూకమామిడి ప్రాజెక్టుకు నీటిని విడుదల చేసి రైతులను ఆదుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో పోతుగంటి లక్ష్మణ్, శాస్త్రబోయిన వెంకటేశ్వర్లు, ఎర్రగొర్ల రామారావు, ఒరుగంటి శ్రీను, అశోక్, శివతో పాటు రైతులు పాపారావు, కాంతారావు, రాజులు, నాగేష్, వెంకటేష్, శ్రీను తదితరులు పాల్గొన్నారు.

# రాంపురంలో ఘనంగా బోనాల వేడుకలు



**టేకులపల్లి,జూలై 30, ప్రజాజ్యోతి:** టేకులపల్లి మండలంలోని రాంపురం గ్రామంలో గురువారం గ్రామదేవతలకు భక్తిశ్రద్ధలతో బోనాల వేడుకలు ఘనంగా నిర్వహించారు. సంప్రదాయ వస్త్రధారణలో మహిళలు బోనాలను తలపై మోసుకుంటూ డప్పు వాయిద్యాల నడుమ నృత్యాలు చేస్తూ ఊరేగింపుగా గ్రామదేవత ఆలయానికి చేరుకుని బోనాలు సమర్పించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామంలో ఆధ్యాత్మిక వాతావరణం నెలకొంది. గ్రామస్తులు, మహిళలు, యువకులు పెద్ద ఎత్తున పాల్గొని అమ్మవారిని దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు. గ్రామ ప్రజలంతా ఐకమత్యంతో వేడుకలను విజయవంతంగా నిర్వహించారు.

# టేకులపల్లిలో ఘనంగా ముగిసిన సీఐటీయూ గేట్ మీటింగ్

- పూసపల్లి ఓసీ కోసం ఐక్య ఉద్యమానికి పిలుపు



**టేకులపల్లి, జూలై 30, ప్రజాజ్యోతి:** టేకులపల్లి మండలంలోని కోయగూడెం ఓపెన్‌కాస్ట్ మైన్ వద్ద గురువారం సింగరేణి కాలరీస్ ఎంప్లాయీస్ యూనియన్ (సీఐటీయూ) ఇల్లందు బ్రాంచ్ ఆధ్వర్యంలో గేట్ మీటింగ్ ఘనంగా నిర్వహించారు. ఇల్లందు బ్రాంచ్ కార్యదర్శి ఎం.డి. అబ్బాస్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో కార్మికుల హక్కుల పరిరక్షణ, చట్టబద్ధమైన ప్రయోజనాలు, స్థానిక సింగరేణి సమస్యలపై విస్తృతంగా చర్చించారు. ఈ కార్యక్రమానికి సీఐటీయూ రాష్ట్ర అధ్యక్షులు, జేబీసీసీఐ సభ్యులు కామ్రేడ్ మంద నరసింహారావు ముఖ్య అతిథిగా హాజరై ప్రసంగించారు. పూసపల్లి ఓపెన్‌కాస్ట్ ప్రాజెక్టు ఇల్లందు ప్రాంత భవిష్యత్తుకు అత్యంత కీలకమని పేర్కొంటూ, దీనిని సాధించేందుకు కార్మిక సంఘాలు, రాజకీయ పార్టీలు, ప్రజాప్రతినిధులు, కార్మికులు, స్థానిక ప్రజలందరూ ఐక్యంగా ఉద్యమించాలని పిలుపునిచ్చారు. డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క డిసైడ్ బ్లాక్‌ల పరిశీలనకు వచ్చిన సందర్భంగా కార్మికులను, కార్మిక నాయకులను కలవకుండా వెళ్లడం వెనుక కారణమేంటని ఆయన ప్రశ్నించారు. గతంలో అండర్‌గ్రౌండ్ నుంచి సర్ఫేస్‌కు బదిలీ కావడంతో జీతాలు నష్టపోయిన 23 మంది కార్మికులకు ఐదేళ్ల పోరాటం అనంతరం కోర్టు ద్వారా న్యాయం సాధించామని గుర్తు చేశారు. ప్రస్తుతం అదే పరిస్థితిలో ఉన్న కార్మికులు కూడా న్యాయపరంగా తమ హక్కులను సాధించుకునే అవకాశం ఉందని సూచించారు. సీఐటీయూ జిల్లా అధ్యక్షులు బ్రహ్మాచారి మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సింగరేణి పట్ల నిర్లక్ష్య వైఖరిని వీడాలని కోరారు. సింగరేణికి సంబంధించిన 11 బ్లాక్‌లను సంస్థకే కేటాయించాలని, లేనిపక్షంలో భారీ స్థాయిలో ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు. ఈ సమావేశంలో సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షులు అబ్దుల్ నబీ, ఇల్లందు బ్రాంచ్ కార్యదర్శి ఎం.డి. అబ్బాస్, చందర్, వీరన్నతో పాటు పలువురు కార్మికులు పాల్గొన్నారు.

# సీపీఎస్ రద్దు చేసి ఓపీఎస్ అమలు చేయాలి

- : డాక్టర్ గరిక శ్రీనివాస్



**ములకలపల్లి, జులై 30 (ప్రజాజ్యోతి):** ఎన్నికల మేనిఫెస్టోలో ఇచ్చిన హామీల మేరకు సీపీఎస్‌ను రద్దు చేసి ఓపీఎస్‌ను అమలు చేయడంతో పాటు పెండింగ్‌లో ఉన్న డీఏలు, పీఆర్సీ, ఆర్థిక లను వెంటనే ప్రకటించాలని ఏఐవైఎఫ్ జాతీయ ప్రధాన కార్యదర్శి, హ్యూమన్ రైట్స్ జిల్లా చైర్మన్ డాక్టర్ గరిక శ్రీనివాస్ డిమాండ్ చేశారు. సీపీఎస్ విధానం ఉద్యోగులకు అన్యాయం చేస్తోందని, ఆరు డీఏలు పెండింగ్‌లో ఉండగా, పీఆర్సీని కూడా ఇప్పటివరకు అమలు చేయలేదని విమర్శించారు. ఫ్రెండ్లీ ప్రభుత్వం అని చెప్పుకుంటున్న ప్రభుత్వం ఎన్నికల హామీలను నిలబెట్టి ఉద్యోగుల సమస్యలను వెంటనే పరిష్కరించాలని ఆయన కోరారు.

# కోయగూడెం యాదవ సంఘానికి కొత్త కుల పెద్దల ఎంపిక



**టేకులపల్లి,జూలై 30,ప్రజాజ్యోతి:** టేకులపల్లి మండలం కోయగూడెం గ్రామంలో యాదవ సంఘం ఆధ్వర్యంలో కుల పెద్దల ఎన్నిక ఏకగ్రీవంగా జరిగింది. ఈ ఎన్నికలో కుల పెద్ద (గొల్ల)గా పెరుగు సత్యనారాయణ, కుల సారగొల్లగా ఎర్రగడ్డ గురవయ్యను సభ్యులు ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. నూతనంగా ఎన్నికైన కుల పెద్దలను గ్రామ పెద్దలు, యాదవ సంఘ సభ్యులు ఘనంగా సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు. సమాజ ఐక్యతను మరింత బలోపేతం చేస్తూ, యాదవ సంఘ అభివృద్ధికి కృషి చేయాలని, గ్రామ ప్రజలందరికీ అందుబాటులో ఉండి సేవలందించాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో గ్రామ పెద్దలు, యాదవ సంఘ సభ్యులు, యువకులు తదితరులు పాల్గొన్నారు.

# భారీ వర్షాల నేపథ్యంలో మండల ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

- డిప్యూటీ కలెక్టర్ (యూ/టీ) & తహసీల్దార్ మద్దినేని మురళి



**దమ్మపేట, జూలై. 30, (ప్రజాజ్యోతి):** అల్పపీడన ప్రభావంతో కురుస్తున్న భారీ వర్షాల నేపథ్యంలో దమ్మపేట మండల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని డిప్యూటీ కలెక్టర్ (యూ/టీ) & తహసీల్దార్ మద్దినేని మురళి సూచించారు. భారీ వర్షాల కారణంగా చెరువులు, వాగులు, వంకలు, కాలువలు ప్రమాదకర స్థాయిలో ప్రవహించే అవకాశం ఉన్నందున ప్రజలు అలాంటి ప్రాంతాలకు వెళ్లకుండా జాగ్రత్తలు తీసుకోవాలని తెలిపారు. ముఖ్యంగా చేపల వేటకు వెళ్లరాదని, వరద ప్రవాహాలు ఉన్న ప్రాంతాలను దాటే ప్రయత్నం చేయవద్దని సూచించారు. గ్రామాల్లో ఎక్కడైనా వరద నీరు చేరినా, చెరువులకు గండ్లు పడినా లేదా ఇతర విపత్తు పరిస్థితులు ఏర్పడినా వెంటనే గ్రామ పంచాయతీ, రెవెన్యూ అధికారులు లేదా సంబంధిత అధికారులకు సమాచారం అందించాలని కోరారు. ఉరుములు, మెరుపులతో కూడిన వర్షాలు కురిసే అవకాశం ఉన్నందున చెట్ల కింద, విద్యుత్ స్తంభాల సమీపంలో లేదా బహిరంగ ప్రదేశాల్లో ఉండకుండా సురక్షిత ప్రాంతాల్లో ఆశ్రయం పొందాలని సూచించారు. వాతావరణ పరిస్థితులు పూర్తిగా సాధారణ స్థితికి చేరుకునే వరకు ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండి ప్రభుత్వ యంత్రాంగం జారీ చేసే సూచనలు, హెచ్చరికలను తప్పనిసరిగా పాటించాలని డిప్యూటీ కలెక్టర్ (యూ/టీ) & తహసీల్దార్ శ్రీ మద్దినేని మురళి మండల ప్రజలకు విజ్ఞప్తి చేశారు.

## విలేకరి తోట మల్లయ్యను పరామర్శించిన ఎమ్మెల్యే జారే



**దమ్మపేట,జూలై.30,(ప్రజాజ్యోతి ):** ఇటీవల మరణించిన ప్రముఖ విలేకరి తోట మల్లయ్య తండ్రి తోట పొట్టియ్య చిత్రపటానికి అశ్వారావుపేట ఎమ్మెల్యే జారే ఆదినారాయణ గురువారం పుష్పాంజలి ఘటించి నివాళులర్పించారు. అనంతరం తోట మల్లయ్యతో పాటు కుటుంబ సభ్యులను పరామర్శించి, ప్రగాఢ సానుభూతిని వ్యక్తం చేశారు.ఈ సందర్భంగా పొట్టియ్య ఆత్మకు శాంతి చేకూరాలని, వారి కుటుంబ సభ్యులకు ఈ విషాదాన్ని తట్టుకునే మనోధైర్యాన్ని భగవంతుడు ప్రసాదించాలని ఎమ్మెల్యే ఆకాంక్షించారు. కుటుంబానికి ఎల్లప్పుడూ అండగా ఉంటామని భరోసా ఇచ్చారు.ఈ కార్యక్రమంలో మండల కాంగ్రెస్ అధ్యక్షుడు కక్కిరాల రమేష్, చిన్నశెట్టి యుగంధర్, గుర్రం మల్లేశ్, చిన్నశెట్టి గోపి, పిట్ల శీను, గట్ల నాగరాజు, అయ్యప్ప, జెట్టి వెంకటేశ్వరరావు, ప్రజాప్రతినిధులు, పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## వర్షపు నీటి పారుదలకు ప్రత్యేక చర్యలు

- **ఉపసర్పంచ్ ఆధ్వర్యంలో కాలువల పూడికతీత**



**దమ్మపేట,జూలై.30,(ప్రజాజ్యోతి ):** గత రెండు రోజులుగా కురుస్తున్న వర్షాల నేపథ్యంలో దమ్మపేట మండల కేంద్రంలో వర్షపు నీరు నిల్వ కాకుండా ప్రత్యేక చర్యలు చేపట్టారు. గ్రామంలోని పలు ప్రాంతాల్లో వర్షపు నీరు వెళ్లకుండా అడ్డంకిగా ఉన్న కాలువలను గుర్తించి, సర్పంచ్ పగడాల రమాదేవి రాంబాబు ఆదేశాల మేరకు ఉపసర్పంచ్ ఆంగోతు శ్రీనివాసరావు జేసీబీతో పూడికతీత పనులు నిర్వహించారు.కాలువల్లో పేరుకుపోయిన మట్టి, చెత్తను తొలగించడంతో వర్షపు నీరు, మురుగునీరు సాఫీగా కాలువల ద్వారా వెళ్లేలా మార్గం ఏర్పడింది. దీంతో నీటి నిల్వ సమస్య తగ్గి ప్రజలకు ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకున్నామని గ్రామపంచాయతీ ప్రతినిధులు తెలిపారు.పనులను వార్డు సభ్యులు పానుగంటి లక్ష్మణ్ గౌడ్, చిన్నశెట్టి ముక్తేశ్వరరావు, గ్రామపంచాయతీ సిబ్బంది పగడాల గోపి తదితరులు పర్యవేక్షించారు.

# ఇల్లందు భవిష్యత్ కై ఐఎన్టియుసి ఆందోళనకు సిద్ధం..!

- **ఇల్లందు ఏరియా మనుగడకై ఐఎన్టీయూసీ పోరాటం**
- **జీఎం కార్యాలయం ముట్టడికి శ్రీకారం**
- **సింగరేణి పురిటిగడ్డ ఇల్లందును మరవద్దని యాజమాన్యానికి విజ్ఞప్తి**
- **పూసపల్లి ఓపెన్‌కాస్ట్ ప్రాజెక్టును వెంటనే ప్రారంభించాలని డిమాండ్**
- **కాలయాపన కొనసాగితే నిరాహార దీక్షలకు సిద్ధమంటున్న ఐఎన్టీయూసీ బృందం**
- **బొగ్గుట్టను కాలగర్భంలో కలపొద్దని కార్మిక సంఘాల సూచన**
- **సింగరేణి యాజమాన్యం స్పందనపై కార్మికుల్లో ఉత్కంఠ**

**ఇల్లందు, జులై 30 (ప్రజా జ్యోతి)** సింగరేణి ఇల్లందు ఏరియా భవిష్యత్తు, కార్మికుల ఉపాధి పరిరక్షణ, ప్రాంతీయ అభివృద్ధి లక్ష్యంగా ఇండియన్ నేషనల్ ట్రేడ్ యూనియన్ కాంగ్రెస్ (ఐఎన్టీయూసీ) పోరాటానికి సిద్ధమైంది. ఇల్లందు ఏరియా మనుగడ కోసం దశలవారీ ఆందోళన కార్యక్రమాలను చేపట్టనున్నట్లు సంఘం నాయకుడు ప్రకటించారు. ఇందులో భాగంగా మొదటి దశలో ఆగస్టు 1న




జీఎం కార్యాలయం ముట్టడికి శ్రీకారం చుట్టనున్నట్లు తెలిపారు. సింగరేణి యాజమాన్యం స్పందించి బొగ్గుట్టను కనుమరుగు కాకుండా, పూర్వ వైభవం వచ్చేలా కాలయాపన చేయకుండా పూసపల్లి ఓసిని ప్రారంభించాలని సింగరేణి కార్మికులు కోరుతున్నారు.

ఈ ప్రాజెక్టు అమల్లోకి వస్తే ప్రత్యక్ష, పరోక్షంగా వందలాది మందికి ఉపాధి లభించడంతో పాటు ఇల్లందు ఏరియాకు ఆర్థికంగా కొత్త ఒరవడికి శ్రీకారం చుట్టడం జరుగుతుందని పేర్కొన్నారు. ఇకపై హామీలతో కాలయాపన కాకుండా కార్యాచరణ ప్రారంభించాలని డిమాండ్ చేశారు.

### ››› పురిటిగడ్డను విస్మరించవద్దు ....

సింగరేణి చరిత్రకు ఇల్లందు పురిటిగడ్డలాంటి ప్రాంతమని, అలాంటి ప్రాంతాన్ని నిర్లక్ష్యం చేయడం సరైన విధానం కాదని ఐఎన్టీయూసీ నాయకులు పేర్కొన్నారు. గనుల కార్యకలాపాలు తగ్గిపోవడం, కొత్త ప్రాజెక్టులు లేకపోవడం వల్ల స్థానిక యువత ఉపాధి అవకాశాలు కోల్పోతున్నారని, వ్యాపార వర్గాలు కూడా ఇబ్బందులు ఎదుర్కొంటున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు.

### ››› పూసపల్లి ఓసీపీపై డిమాండ్! ....

ఎన్నో ఏళ్లుగా పెండింగ్‌లో ఉన్న పూసపల్లి ఓపెన్‌కాస్ట్ ప్రాజెక్టును వెంటనే ప్రారంభించాలని యాజమాన్యాన్ని ఐఎన్టీయూసీ బృందం కోరుతున్నారు.

### ››› నిరాహార దీక్షలకు సిద్ధం ....

పూసపల్లి ఓసి ని త్వరితగతిన ప్రారంభించాలని, జాప్యం కొనసాగితే ఉద్యమాన్ని మరింత ఉధృతం చేస్తామని ఐఎన్టీయూసీ బృందం హెచ్చరించింది. ఆగస్ట్ 1న జీఎం కార్యాలయం ముట్టడితో పాటు నిరాహార దీక్షలు, రిలే దీక్షలు, భారీ నిరసన కార్యక్రమాలు చేపట్టేందుకు సిద్ధంగా ఉన్నామని స్పష్టం చేసింది. కార్మికుల హక్కులు, ఇల్లందు ఏరియా మనుగడ కోసం చివరి వరకు పోరాడతామని నాయకులు స్పష్టం చేశారు.

### ››› యాజమాన్యం ఎలా స్పందిస్తుందో ?

ఒకప్పుడు బొగ్గు ఉత్పత్తికి కేంద్రంగా నిలిచిన ఇల్లందు బొగ్గుట్టను కాలగర్భంలో కలిసిపోయే పరిస్థితి తీసుకురావద్దని ఐఎన్టీయూసీ బృందం విజ్ఞప్తి చేసింది. కొత్త గనుల అభివృద్ధి, పూసపల్లి ఓసీపీ ప్రారంభం, స్థానికులకు ఉపాధి కల్పనపై సింగరేణి యాజమాన్యం త్వరితగతిన నిర్ణయం తీసుకోవాలని కోరింది. ఐఎన్టీయూసీ ప్రకటించిన ఆందోళనలపై యాజమాన్యం ఎలాంటి నిర్ణయం తీసుకుంటుందనే అంశం ప్రస్తుతం కార్మికులు, ప్రజల్లో ఆసక్తిగా మారింది. ఏది ఏమైనా సింగరేణికి పుట్టినిల్లయిన ఇల్లందు ఏరియా మనుగడ కొనసాగాలంటే పూసపల్లి ఓసి ప్రారంభించాల్సిందేనన్నది జగమెరిగిన సత్యం.

### ››› పూసపల్లి ఓసిని వెంటనే ప్రారంభించాలి

**జె వెంకటేశ్వర్లు, ఇల్లందు ఏరియా ఉపాధ్యక్షుడు, ఐఎన్టియుసి ....**



ఇల్లందు ఏరియా మనుగడ కొనసాగాలంటే యాజమాన్యం పూసపల్లి ఓసినీ ప్రారంభించాలి. ఇల్లందు ఏరియా భవిష్యత్తు కోసం అవసరమైతే ఆందోళన కార్యక్రమాలతో పాటు రిలే నిరాహార దీక్షలు, ఆమరణ నిరాహార దీక్షలు చేసేందుకు ఐఎన్టీయూసీ బృందం సిద్ధంగా ఉంది. పూసపల్లి ఓసిని ప్రారంభించి ఇల్లందు ఏరియా నుండి డిప్యూటేషన్ బదిలీపై వెళ్లిన కార్మికులను మరల ఇల్లందుకు తీసుకురావాలి. రాష్ట్ర ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లి ముఖ్యమంత్రి, ఉపముఖ్యమంత్రి, మంత్రులు, ఇల్లందు ఎమ్మెల్యే సహకారంతో కాలయాపన చేయకుండా పూసపల్లి ఓసి బొగ్గు ఉత్పత్తి పనులు ప్రారంభించాలి.

# అంగన్వాడీల సమస్యలు పరిష్కరించాలి

- **కేంద్ర బడ్జెట్‌లో ఐసీడీఎస్‌కు తగిన నిధులు కేటాయించాలి**
- **సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు పిట్టల అర్జున్**

**దమ్మపేట,జూలై.30,(ప్రజాజ్యోతి):** కేంద్ర బడ్జెట్‌లో సమీకృత శిశు అభివృద్ధి సేవల (ఐసీడీఎస్) పథకానికి తగిన నిధులు కేటాయించకపోవడంతో అంగన్వాడీ ఉద్యోగుల సమస్యలు పరిష్కారం కావడం లేదని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు పిట్టల అర్జున్ విమర్శించారు. గురువారం దురదపాడు, చలమప్పగూడెం గ్రామాల్లో నిర్వహించిన అంగన్వాడీ టీచర్ల సమావేశాల్లో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు.గ్రామీణ



ప్రాంతాల్లోని పేదలకు పోషకాహారం అందించి మాతా–శిశు మరణాలను తగ్గించాలనే లక్ష్యంతో ఐసీడీఎస్‌ను ఏర్పాటు చేసినప్పటికీ, పాలకుల నిర్లక్ష్యంతో ఆ లక్ష్యం నెరవేరడం లేదని ఆయన అన్నారు. అంగన్వాడీ ఉద్యోగులకు




వేతనాల పెంపు, ఉద్యోగ భద్రత, పదవీ విరమణ అనంతర ప్రయోజనాల కల్పనలో కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం విఫలమైందని ఆరోపించారు.అంగన్వాడీ ఉద్యోగులకు నెలకు కనీసం రూ.26 వేల వేతనం చెల్లించాలని, లేబర్ కోడ్‌లను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. అలాగే రైతులు, వ్యవసాయ కూలీల సమస్యల పరిష్కారం కోసం ఆగస్టు 10న 'క్విట్ ఇండియా' ఉద్యమ స్ఫూర్తితో చేపట్టనున్న 'జైలు భరో' కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.ఈ సమావేశాల్లో సీఐటీయూ మండల కన్వీనర్ మురహరి రఘు, సూరమ్మ, జ్యోతి, వెంకటేశ్వరమ్మ, శ్రీదేవి, వజ్రమ్మ, వెంకటలక్ష్మి, రామలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

- వర్షాభావం పేరుతో పంటలు మార్చమంటున్న ప్రభుత్వం, అధికారులు
- రైతు వేదికల్లో ప్రత్యామ్నాయ పంటలపై అవగాహన కల్పిస్తున్న జిల్లా యంత్రాంగం
- కానీ కోతుల సమస్యకు మాత్రం పరిష్కారం చూపడం లేదని రైతుల ఆవేదన
- పప్పుధాన్యాలు, నూనెగింజల పంటలన్నీ కోతుల బారినే
- పంటలు కాపాడితే ఏ పంటనైనా సాగు చేస్తామని స్పష్టం చేస్తున్న రైతాంగం



# కోతుల బెడదకు మార్గం చూపితే... ప్రత్యామ్నాయ పంటలకు సిద్ధమే..!

భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ప్రతినిధి | జూలై 30 | ప్రజాజ్యోతి

రాష్ట్రంలో ఈ ఏడాది ఎల్‌నినో ప్రభావంతో వర్షాభావ పరిస్థితులు నెలకొనే అవకాశం ఉందని వాతావరణ శాఖ హెచ్చరికల నేపథ్యంలో అధిక నీటి అవసరమయ్యే వరి, పత్తి వంటి పంటల సాగును తగ్గించి ప్రత్యామ్నాయ పంటల వైపు మళ్లాలని రాష్ట్ర ప్రభుత్వం రైతులకు సూచిస్తోంది. ఈ మేరకు వ్యవసాయ శాఖ అధికారులు గ్రామాల వారీగా అవగాహన కల్పిస్తుండగా, జిల్లా కలెక్టర్ కూడా మండలాల వారీగా రైతు వేదికల్లో సమావేశాలు నిర్వహిస్తూ తక్కువ నీటితో సాగయ్యే పెసర, మినుములు, కందులు, శనగ, వేరుశెనగ, నువ్వులు, మొక్కజొన్న తదితర ప్రత్యామ్నాయ పంటలను సాగు చేయాలని రైతులకు సూచిస్తున్నారు. అయితే ప్రభుత్వ సూచనలను రైతులు వ్యతిరేకించడం లేదు. కానీ 'ప్రత్యామ్నాయ పంటలు వేయడానికి మేము సిద్ధంగానే ఉన్నాం. ముందుగా కోతుల బెడద నుంచి మా పంటలకు రక్షణ కల్పించే మార్గం చూపండి అని అంటున్నారు. ఆ భరోసా కల్పిస్తే ప్రభుత్వం సూచించే ఏ పంటనైనా సాగు చేస్తాం.. అని జిల్లాలోని రైతాంగం స్పష్టం చేస్తోంది.

### ♦ జిల్లాలో ఐదు లక్షల ఎకరాల్లో సాగు...

భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో ప్రతి యేట దాదాపు ఐదు లక్షల ఎకరాల్లో వివిధ రకాల పంటలు సాగవుతున్నాయి. ఇందులో సుమారు లక్ష ఎకరాల్లో ఆయిల్ పామ్, 1.80 లక్షల నుంచి 2 లక్షల ఎకరాల వరకు పత్తి, మరో లక్ష ఎకరాల్లో వరి సాగు జరుగుతోంది. మిగిలిన భూముల్లో పెసర, మినుములు, కందులు, శనగ, వేరుశెనగ, నువ్వులు, మొక్కజొన్న, మిర్చి, కూరగాయలు తదితర పంటలను రైతులు సాగు చేస్తున్నారు. అయితే ప్రస్తుతం నీటి లభ్యతను దృష్టిలో ఉంచుకుని వరి, పత్తి సాగును తగ్గించి పప్పుధాన్యాలు, నూనెగింజల పంటల వైపు మళ్లాలని ప్రభుత్వం సూచిస్తోంది. అయితే ప్రభుత్వం సూచిస్తున్న పంటలే కోతులకు అత్యంత ఇష్టమైనవని రైతులు చెబుతున్నారు. ముఖ్యంగా ఈ పంటలు సాగు చేస్తే కోతుల కారణంగా తీవ్రంగా దెబ్బతింటున్నాయని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మొలక దశ నుంచి పూత, కాయ దశలోనే.. కోతులు గుంపులుగా వచ్చి పంటలను నాశనం చేస్తాయని, ఉదయం నుంచి సాయంత్రం వరకు పొలాల్లో కాపలా కాసినా వాటిని అడ్డుకోవడం సాధ్యం కావడం లేదని చెబుతున్నారు. దీంతో విత్తనాలు, ఎరువులు, పురుగుమందులు, కూలీల కోసం భారీగా పెట్టుబడి పెట్టినా చివరకు పంట కోతుల పాలై దిగుబడి చేతికి రాక రైతులు ఆర్థికంగా తీవ్రంగా నష్టపోతున్నారు.



### ♦ అన్ని చోట్ల కోతుల బెడదే...

వాస్తవానికి జిల్లాలోని దాదాపు అన్ని మండలాల్లో కోతుల సమస్య రోజురోజుకూ తీవ్రమవుతోంది. ఒకప్పుడు అడవులకు ఆనుకుని ఉన్న గ్రామాలకే పరిమితమైన ఈ సమస్య ప్రస్తుతం పట్టణ శివార్ల వరకు విస్తరించింది. గుంపులుగా సంచరిస్తున్న కోతులు ఇళ్లలోకి చొరబడి ఆహార పదార్థాలు, పండ్లు, కూరగాయలు ఎత్తుకెళ్తుండగా.. పొలాల్లో రైతులు సాగు చేస్తున్న పంటలను కూడా విచక్షణారహితంగా ధ్వంసం చేస్తున్నాయి. రైతులు ఆరుగాలం ఎంతో కష్టపడి సాగు చేసినా ఒక్కరోజులోనే పంటలను నాశనం చేయడంతో శ్రమతో పాటు పెట్టుబడి కూడా వృథా అవుతోందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రత్యామ్నాయ పంటలు సాగు చేయాలని ప్రభుత్వం, అధికారులు సూచిస్తున్నా, ఆ పంటలను రక్షించే చర్యలపై మాత్రం ఎలాంటి స్పష్టమైన కార్యాచరణ కనిపించడం లేదని రైతులు విమర్శిస్తున్నారు. కేవలం పంటలు మార్చాలని చెప్పడం వల్ల సమస్య పరిష్కారం కాదని, ముందుగా కోతుల బెడదను నియంత్రించే చర్యలు చేపట్టాలని కోరుతున్నారు. సూచించిన పంటలను సాగు చేస్తాం. కానీ ముందుగా కోతుల బెడద నుంచి పంటలకు శాశ్వత రక్షణ కల్పించాలని రైతులు స్పష్టం చేస్తున్నారు.

### ♦ కోతుల సమస్యపై సమగ్ర కార్యాచరణకై డిమాండ్..

కోతుల సమస్యపై ఇప్పటివరకు సమగ్ర కార్యాచరణ లేకపోవడంపై రైతులు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. పంటల రక్షణ కోసం సౌర విద్యుత్ కంచెలకు అధిక సబ్సిడీ ఇవ్వడం, అటవీ ప్రాంతాల్లో కోతులకు ప్రత్యేక ఆహార కేంద్రాలు ఏర్పాటు చేయడం లాంటివి చెయ్యాలని డిమాండ్ చేస్తున్నారు. కోతులను గ్రామాలు, వ్యవసాయ క్షేత్రాల వైపు రాకుండా శాస్త్రీయ చర్యలు చేపట్టడం, అటవీ, వ్యవసాయ శాఖలు సంయుక్తంగా ప్రత్యేక కార్యాచరణ రూపొందించడం వంటి చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు. అలాగే కోతుల వల్ల పంట నష్టపోయిన రైతులకు ప్రత్యేక పరిహారం అందించే విధానాన్ని కూడా ప్రభుత్వం అమలు చేయాలని డిమాండ్ చేస్తున్నారు. వ్యవసాయ నిపుణులు కూడా ఇదే అభిప్రాయాన్ని వ్యక్తం చేస్తున్నారు. ప్రత్యామ్నాయ పంటల సాగును విజయవంతం చేయాలంటే కేవలం పంటలు మార్చాలని సూచించడం సరిపోదని, రైతులు ఎదుర్కొంటున్న కోతుల సమస్యకు శాశ్వత పరిష్కారం చూపడంతో పాటు పంటల రక్షణకు అవసరమైన సదుపాయాలు కల్పించాలని అంటున్నారు. ఇలాంటి పెట్టుబడికి భరోసా కల్పించినప్పుడే ప్రభుత్వ లక్ష్యం నెరవేరుతుందని వారు సూచిస్తున్నారు. దీంతో ప్రస్తుతం రైతాంగం ప్రభుత్వానికి, జిల్లా కలెక్టర్ కు ఒక్కటే విజ్ఞప్తి చేస్తోంది... "ముందు కోతుల బెడద నుంచి మా పంటలను కాపాడండి... తర్వాత ప్రభుత్వం సూచించే ఏ ప్రత్యామ్నాయ పంటనైనా సాగు చేయడానికి మేము సిద్ధమేనని."

## కబ్జాలకైతే కలిసిపోతారు..!

(మొదటి పేజీ తరువాయి...)

ఫిర్యాదు చేయడంతో విచారణ నిర్వహించిన అధికారులు ఆ ఇంటి నంబర్లను రద్దు చేసి, స్థలాన్ని ప్రభుత్వ భూమిగానే గుర్తించినట్లు చెబుతున్నారు. అదే సమయంలో ఈ స్థలంలో ప్రజలకు ఉపయోగపడేలా కమ్యూనిటీ హాల్‌తో పాటు పార్కు ఏర్పాటు చేయాలని అప్పటి కొత్తగూడెం మున్సిపల్ కౌన్సిల్ సుమారు రూ.25 లక్షల వ్యయంతో అభివృద్ధి ప్రతిపాదన కూడా చేసినట్లు సమాచారం. అయితే నిధుల కొరతతో ఆ ప్రతిపాదన అమలుకాకపోవడంతో స్థలం అలాగే మిగిలిపోయింది. ప్రస్తుతం మున్సిపాలిటీ కార్పొరేషన్‌గా మారిన తర్వాత ఈ వ్యవహారం మళ్లీ తెరపైకి వచ్చినట్లు స్థానికులు చెబుతున్నారు. దీంతో ఒక్కసారిగా ఇక్కడి నాయకుల దృష్టి ఈ స్థలంపై మళ్లీ పడిందని, స్థానికంగా ఉన్న వేర్వేరు రాజకీయ పార్టీలకు చెందిన ఇద్దరు కార్పొరేటర్లు, అదే ప్రాంతానికి చెందిన ఓ మాజీ కౌన్సిలర్ పరస్పర అవగాహనతో వ్యవహరిస్తున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. కోట్ల రూపాయల విలువ చేసే ఈ ప్రభుత్వ భూమిని ఓ బంగారు వ్యాపారికి విక్రయించే ప్రయత్నాలు జరుగుతున్నాయని, ఇందుకు గాను మొదట రూ.10 లక్షలు అడ్వాన్స్‌గా ఈ నేతలు తీసుకున్నట్లు తెలుస్తోంది. నిర్మాణ పనులు పూర్తయిన తర్వాత మిగిలిన మొత్తాన్ని చెల్లించేలా ఒప్పందం కుదిరిందనే ప్రచారం కూడా సాగుతోంది. దీంతో ఇటీవల స్థలంలో మళ్లీ నిర్మాణాలకు సంబంధించిన ఏర్పాట్లు జరుగుతున్నాయనే సమాచారం వెలువడడంతో స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. గతంలో ప్రభుత్వ భూమిగా గుర్తించి ఇంటి నంబర్లు సైతం రద్దు చేసిన స్థలం మళ్లీ ప్రైవేట్ వ్యక్తుల చేతికి ఎలా వెళ్లిందని వారు ప్రశ్నిస్తున్నారు. ఈ వ్యవహారంపై రెవెన్యూ, మున్సిపల్, కార్పొరేషన్ అధికారులు వెంటనే సమగ్ర విచారణ చేపట్టి భూమి యాజమాన్యంపై పూర్తి వివరాలను వెల్లడించాలని స్థానికులు కోరుతున్నారు. లేకుంటే ఇక్కడ ఆందోళన చేసేందుకు కూడా వెనుకాడబోమని వారు స్పష్టం చేస్తున్నారు. అయితే ఈ కబ్జా కోరులకు స్థానికంగా ట్రెండింగ్‌లో ఉన్న ఓ నేత ఆశీస్సులు ఉన్నాయనే ప్రచారం కూడా సాగుతుండటం ఇందులో మరో చర్చనీయాంశంగా మారింది. అయితే ఈ వ్యవహారం పై బయట రాజకీయంగా ఎంత విభేదాలు ఉన్నా, కబ్జాల విషయానికి వచ్చేసరికి మాత్రం అందరూ ఒక్కటే అవుతారేమోనని స్థానికులు మాట్లాడుకోవడం గమనార్హం.